క్లుప్తంగా

నామినేషన్లు నిల్

జంగారెడ్డిగూడెం రూరల్ : జంగారెడ్డిగూడెం మండలం శ్రీనివాసపురం పంచాయతీ సర్పంచ్ ఉప ఎన్నికకు మంగళవారం శ్రీనివాసపురం సచివాలయంలో నామినేషన్ల స్వీకరణ చేపట్టారు. ఈరోజు ఒక్క నామినేషన్ కూడా రాలేదని ఎన్నికల రిట్నరింగ్ అధికారి డి.సురేష్ తెలిపారు. 9, 10 తేదీల వరకు నామినేషన్ల స్వీకరణ ప్రక్రియ కొనసాగుతుందన్నారు.

160 మందికి కంటి వైద్య సేవలు



ఉచిత నేత్ర వైద్యశిబిరంలో కంటి పరీక్షలు నిర్వహిస్తున్న దృశ్యం

జంగారెడ్డిగూడెం: సినీ నటుడు మహేష్‌బాబు పుట్టినరోజు సందర్భంగా మహేష్ యువసేన అధ్యక్షులు బవిరిశెట్టి మురళీకృష్ణ ఆధ్వర్యంలో మంగళవారం నిడదవోలు లయన్స్ హాస్పిటల్ వారిచే ఉచిత నేత్ర వైద్య శిబిరం నిర్వహించారు. స్థానిక గంగానమ్మ గుడి సమీపంలో నిర్వహించిన ఈ శిబిరాన్ని లయన్స్ క్లబ్ ప్రెసిడెంట్ కన్నం హనుమంతరావు ప్రారంభించారు. శిబిరంలో 160 మందికి కంటి పరీక్షలు నిర్వహించగా, 60 మందికి ఆపరేషన్లు అవసరం అని గుర్తించారని, 70 మంది కళ్లజోళ్లు అందజేశామని మురళీకృష్ణ వెల్లడించారు. 100 మందికి రామకృష్ణ మెడికల్స్ అధినేత చైతన్య ఉచితంగా మందులు అందజేశారన్నారు. కార్యక్రమంలో గంగానమ్మ ఆలయ కమిటీ చైర్మన్ కలగర వీర్రాజు, ట్రెజరర్ చింతా నాగరాజు, లయన్స్‌క్లబ్ సభ్యులు, మురళీకృష్ణ మహేష్ యువసేన సభ్యులు పాల్గొన్నారు.

మినీ జాబ్‌మేళా

జంగారెడ్డిగూడెం : స్థానిక త్రివేణి డిగ్రీ కళాశాలలో మంగళవారం ఆంధ్రప్రదేశ్ స్కిల్ డెవలప్‌మెంట్, త్రివేణి డిగ్రీ కళాశాల సంయుక్తంగా మినీ జాబ్ మేళా నిర్వహించారు. ఈ జాబ్ మేళాలో హెటిరో డ్రగ్స్, ముత్తూట్ ఫైనాన్స్, టీమ్ లీజ్, మోహన్ స్పిన్‌టెక్స్ ప్రతినిధులు పాల్గొని ఇంటర్వ్యూలు నిర్వహించినట్లు ఏపీఎస్ఎస్‌డీసీ డీఎస్‌డీవో తమ్మాజీరావు తెలిపారు. మొత్తం 225 మంది ఇంటర్వ్యూలో పాల్గొనగా హెటిరోకు 11 మంది, ముత్తూట్‌కు 16 మంది, టీమ్ లీజ్‌కు 59 మంది, మోహన్ స్పిన్‌టెక్స్‌కు 8 మంది విద్యార్థులు ఎంపికయ్యారన్నారు. కార్యక్రమంలో యంగ్ ప్రొఫెషనల్ ఇన్ ఎంప్లాయిమెంట్ ఆఫీస్ ప్రవీణ్, త్రివేణీ కళాశాల కరస్పాండెంట్ హెచ్ మురళీమోహన్ రావు, డైరెక్టర్ ఫణీష్ రామ్, కళాశాల సిబ్బంది పాల్గొన్నారు.

జాతీయ లోక్ అదాలత్‌ను వినియోగించుకోండి



జూనియర్ సివిల్ జడ్జి మధుబాబు

చింతలపూడి : పెండింగ్ కేసుల పరిష్కారానికి జాతీయ లోక్‌అదాలత్‌లను వినియోగించుకోవాలని జూనియర్ సివిల్ జడ్జి సి మధు బాబు సూచించారు. స్థానిక కోర్టు వద్ద మంగళవారం జరిగిన కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ సెప్టెంబర్ 9 న జరిగే జాతీయ లోక్‌అదాలత్‌లో క్రిమినల్, సివిల్, బ్యాంక్ రికవరీ, చెక్ బౌన్స్ కేసులు, బీఎస్ఎన్ఎల్ రికవరీ కేసులు, కుటుంబ తగాదా, మనోవర్తి, ప్రామిసరీ నోట్ కేసులు పరిష్కారం చేసుకోవచ్చునని తెలిపారు. లోక్ అదాలత్ గురించి విస్తృతంగా ప్రచారం చేయాలని న్యాయవాదులను, అధికారులను కోరారు. ప్రతిరోజు కోర్టులో ప్రీ సిట్టింగ్స్ ద్వారా కేసులను రాజీ చేస్తున్నట్లు తెలిపారు. కక్షిదారులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. సమాచారం కోసం దగ్గరలో ఉన్న పోలీస్ స్టేషన్లను, కోర్టు సిబ్బందిని సంప్రదించాలని విజ్ఞప్తి చేశారు.

నూరుశాతం ఉత్తీర్ణత సాధించాలి



విద్యార్థులతో కలిసి భోజనం చేస్తున్న పీఓ సూర్యతేజ

బుట్టాయగూడెం : ఈ ఏడాది విద్యా సంవత్సరంలో జరిగే పరీక్షా ఫలితాల్లో గిరిజన సంక్షేమ ఆశ్రమ పాఠశాలల్లో నూరుశాతం ఉత్తీర్ణత సాధించేలా ఉపాధ్యాయులు కృషి చేయాలని ఐటీడీఏ ప్రాజెక్టు అధికారి ఎం.సూర్యతేజ అన్నారు. మండలంలోని మారుమూల గ్రామమైన కామయ్యకుంట గిరిజన సంక్షేమ ఆశ్రమ పాఠశాలను మంగళవారం పీఓ సందర్శించారు. ఈ సందర్భంగా 10వ తరగతి విద్యార్థులకు బోధిస్తున్న పాఠ్యాంశాల గురించి విద్యార్థినులను అడిగి తెలుసుకున్నారు. అనంతరం పీఓ మాట్లాడుతూ చదువుల్లో వెనుకంజలో ఉన్నవారికి ప్రత్యేక తరగతులు నిర్వహించి చదువుల్లో ముందుకు సాగేలా కృషి చేయాలని ఆదేశించారు. అలాగే విద్యార్థుల ఆరోగ్యాలపై ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలన్నారు. వసతి గృహాల్లో మోనూ సక్రమంగా అమలు జరిగేలా ప్రధానోపాధ్యాయులు, వార్డెన్లు తగు చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. అనంతరం విద్యార్థులతో కలిసి పీఓ భోజనం చేశారు. విద్యార్థుల కోసం వండిన భోజనం బాగుందని పాఠశాల ప్రధానోపాధ్యాయులు, వార్డెన్‌లను అభినందించారు.

పౌష్టికాహారాన్ని సద్వినియోగం చేసుకోవాలి



టి.నరసాపురం : కృష్ణాపురంలో టేక్ హోమ్ రేషన్‌ను పంపిణీ చేస్తున్న దృశ్యం



కొయ్యలగూడెం : రాజవరంలో వైఎస్సార్ సంపూర్ణ పోషణ కిట్లు అందజేస్తున్న దృశ్యం

టి.నరసాపురం : గర్భవతులు, బాలింతలు వైఎస్సార్ సంపూర్ణ పోషణ ద్వారా అందిస్తున్న పౌష్టికాహారాన్ని సద్వినియోగం చేసుకోవాలని వైఎస్సార్ సీపీ నాయకులు కోరారు. మండలంలోని కృష్ణాపురంలో మంగళవారం వైఎస్సార్ సంపూర్ణ పోషణ టేక్ హోమ్ రేషన్ పంపిణీ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ గర్భవతులు, బాలింతలు రక్తహీనత బారిన పడకుండా ఉండేందుకు సీఎం వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి అంగన్‌వాడీ కేంద్రాల ద్వారా పౌష్టికాహారాన్ని పంపిణీ చేస్తున్నారన్నారు. ప్రతి ఒక్కరూ ఈ పౌష్టికాహారాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీటీసీలు నార్ల పాటి వెంకటరావు, అర్జా బాలయ్య, యూత్ నాయకులు దేవరపల్లి సీతారాంప్రసాద్, పార్టీ మండల యూత్ అధ్యక్షులు కన్నం సర్వేశ్వరరావు, దరావతు రమేష్, రాజా, రవి తదితరులు పాల్గొన్నారు.

కొయ్యలగూడెం : రాజవరం గ్రామంలోని అంగన్‌వాడీ కేంద్రంలో మంగళవారం వైఎస్సార్ సంపూర్ణ పోషణ కిట్లు పంపిణీ చేశారు. గ్రామ సర్పంచ్, రాష్ట్ర సర్పంచ్‌ల ఛాంబర్ ఉపాధ్యక్షులు ఏలేటి చిన తుక్కయ్య చేతుల మీదగా ఈ కిట్లు గర్భిణులు, బాలింతలకు అందజేశారు. తల్లిపాల వారోత్సవాలను పురస్కరించుకుని ముర్రిపాల విశిష్టతపై అవగాహన కల్పించారు. ముందుగా గ్రామంలో తల్లిపాల వారోత్సవాల ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ నాయకులు టి.రెడ్డి, ఎస్‌కే మస్తాన్, ఎస్‌కే పండు, అంగన్‌వాడీ టీచర్లు లీలాకుమారి, కె.వసంతరాణి తదితరులు పాల్గొన్నారు.

సీఎం వైఎస్ జగన్‌ను కలిసిన నేతలు



సీఎంకు పుష్పగుచ్ఛం అందజేస్తున్న గంజిమాల దేవి



సీఎంకు వినతిపత్రం అందజేసిన సందీప్

కొయ్యలగూడెం : కుక్కునూరు మండలం గొమ్ముగూడెం వరద బాధితులను పరామర్శించేందుకు సోమవారం వచ్చిన ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని స్థానిక నాయకులు కలిశారు. స్టేట్ ఫుడ్ కమిషన్ మెంబర్ గంజిమాల దేవి సీఎం వైఎస్ జగన్‌ను కలిసి ప్రభుత్వ సంక్షేమ హాస్టల్లో సమస్యల గురించి వివరించినట్లు తెలిపారు. సంక్షేమ హాస్టళ్లలో నాలుగో తరగతి ఉద్యోగుల సమస్యలను, మధ్యాహ్న భోజన అమలులో విద్యార్థులు పేర్కొన్న సమస్యలను సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి దృష్టికి తీసుకువెళ్లగా ఆయన సానుకూలంగా స్పందించారని ఆమె చెప్పారు.

లింగపాలెం : రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని కుక్కునూరు మండలం గొమ్ముగూడెం హెలి ప్యాడ్ వద్ద లింగపాలెం మండలానికి చెందిన రాష్ట్ర లిడ్ క్యాప్ డైరెక్టర్ సొంగా సందీప్ మర్యాద పూర్వకంగా కలిశారు. ధర్మాజీగూడెంలో బస్టాండ్, జూనియర్ కళాశాల నిర్మాణాన్ని చేపట్టాలని కోరుతూ ఎంపీ కోటగిరి శ్రీధర్ ఆధ్వర్యంలో సీఎంకు వినతిపత్రం అందించారు. దీనిపై సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సానుకూలంగా స్పందించినట్లు ఆయన పేర్కొన్నారు. ఈ సందర్భంగా ప్రభుత్వ పథకాలను మరింతగా ప్రజల్లోకి తీసుకువెళ్లాలని సీఎం చెప్పినట్లు సందీప్ తెలిపారు.

ఆదివాసీ దినోత్సవాన్ని సెలవుదినంగా ప్రకటించాలి



ఆదివాసీ సంక్షేమ పరిషత్ సమావేశంలో మాట్లాడుతున్న కూరం సంజీవరావు

కుక్కునూరు : ఆగస్టు 9 వ తేదీ ఆదివాసీ దినోత్సవాన్ని సెలవుదినంగా ప్రకటించాలని ఆదివాసీ సంక్షేమ పరిషత్ డివిజన్ అధ్యక్షుడు కూరం సంజీవరావు ప్రభుత్వాన్ని కోరారు. మంగళవారం కుక్కునూరులో ఆదివాసీ సంక్షేమ పరిషత్ మండల కమిటీ అత్యవసర సమావేశం ప్రధాన కార్యదర్శి పైదా పరమేష్ అధ్యక్షతన జరిగింది. సంజీవరావు మాట్లాడుతూ ఐక్యరాజ్యసమితి 1994లో ఆగస్టు 9న ఆదివాసీ దినోత్సవాన్ని పండగ దినంగా ప్రకటించిందన్నారు. ఆదివాసీల సంస్కృతి, సంప్రదాయాలు భవిష్యత్తు తరాల వారికి తెలిజేయాలనే ఉద్దేశ్యంతో పండగ దినంగా ప్రకటించడం జరిగిందన్నారు. ఆదివాసీ చట్టాలను పటిష్టంగా అమలు చేయడంలో కేంద్ర, రాష్ట్ర పాలకులు పూర్తిగా విఫలమయ్యారన్నారు. రాష్ట్ర ప్రభుత్వం బోయ, వాల్మీకులను, బెంతు, వరియాలను ఎస్టీ జాబితాలో కలుపుతామని అసెంబ్లీలో చేసిన తీర్మానాన్ని వెనక్కి తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఏజెన్సీ ప్రాంతంలోని నిర్వాసితులను ప్రభుత్వం ఆదుకోవాలని కోరారు. బుధవారం నిర్వహించనున్న ఆదివాసీ దినోత్సవ వేడుకల్లో ఆదివాసీలందరూ పాల్గొని విజయవంతం చేయాలని కోరారు. ఈ సమావేశంలో పెనుబల్లి నాగరాజు, కూరం దుర్గారావు, పరమేశ్వరావు తదితరులు పాల్గొన్నారు.

1వ వేలం కేంద్రం రైతు సంఘం అధ్యక్షుడిగా గాంధీ



గాంధీని అభినందిస్తున్న ఫైవ్‌మన్ కమిటీ సభ్యులు

జంగారెడ్డిగూడెం : జంగారెడ్డిగూడెం -1 పొగాకు వేలం కేంద్రం వర్జీనియా పొగాకు రైతు సంఘం అధ్యక్షుడిగా ఘంటశాల గాంధీ నియమితులయ్యారు. అధ్యక్ష పదవికి వామిశెట్టి హరిబాబు, ఘంటశాల గాంధీ, కూచిపూడి రమేష్ ఉత్సాహాన్ని చూపారు. అయితే రైతు సంఘాల ప్రతినిధులుగా ఒక ఫైవ్‌మన్ కమిటీని ఏర్పాటు చేశారు. ఈ ఫైవ్‌మన్ కమిటీలో ముగ్గరిలో ఎవరిని నిర్ణయిస్తే వారే అధ్యక్షులుగా ఉంటారని నిర్ణయించారు. ఫైవ్‌మన్ కమిటీ సభ్యులుగా గడ్డమణుగు సత్యనారాయణ, పిన్నమనేని రాధాకృష్ణ, కరాటం రెడ్డిబాబు, సుంకవల్లి వీరభద్రరావు, గద్దే లక్ష్మణరావు ఉన్నారు. వీరు ఘంటశాల గాంధీని అధ్యక్షులుగా నిర్ణయించారు. ఈ సందర్భంగా గాంధీని పలువురు అభినందించారు.

గాంధీ ఎన్నిక చెల్లదు

జంగారెడ్డిగూడెం -1వ వేలం కేంద్రం రైతు సంఘం అధ్యక్షుడిగా ఘంటశాల గాంధీ ఎన్నిక చెల్లదని ప్రస్తుత అధ్యక్షులు పరిమి రాంబాబు, పలువురు వర్జీనియా రైతులు ప్రకటించారు. ఏకపక్షంగా అధ్యక్షుడిని నిర్ణయించారని, అధ్యక్షుడిని నిర్ణయించే సమయంలో కనీసం వేలం కేంద్రం పరిధిలో ఉన్న 3వేల మంది రైతులను సమావేశ పరిచి ప్రకటించాల్సి ఉందని, అలా కాకుండా ఫైవ్‌మన్ కమిటీసభ్యులు వారికి వారే నిర్ణయించి ప్రకటించేశారన్నారు. అధ్యక్షుని ప్రకటించే ముందు రైతుల అభిప్రాయాలు కూడా తీసుకోవాల్సి ఉంటుందని, అలా చేయలేదన్నారు. అంతేకాక వేలం కేంద్రం పరిధిలో ఏడు క్లస్టర్‌లు ఉన్నాయని, ప్రతి క్లస్టర్ నుంచి ముగ్గురు డైరెక్టర్‌లను ఎన్నుకుని మొత్తం 21 మంది డైరెక్టర్‌లను ఎన్నుకున్న తరువాత వారి నుంచి అధ్యక్షుడిని, మిగిలిన కార్యవర్గ సభ్యులను ఎన్నుకోవాల్సి ఉందన్నారు. ఘంటశాల గాంధీ ఎంపికను వారు ఖండించారు. అవసరమైతే ఎన్నికలు నిర్వహిస్తామని ప్రకటించారు.

ఘనంగా క్విట్ ఇండియా ఉద్యమ దినోత్సవం

కామవరపుకోట : స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో కళాశాల ఇన్‌చార్జి ప్రిన్సిపాల్ ఎం.మల్లేశ్వరరావు అధ్యక్షతన క్విట్ ఇండియా ఉద్యమ దినోత్సవం కార్యక్రమాన్ని మంగళవారం నిర్వహించారు. మల్లేశ్వరరావు మాట్లాడుతూ భారత జాతీయోద్యమంలో మహాత్మాగాంధీ అనుసరించిన సత్యం, అహింస, సత్యాగ్రహం వంటి సాధనాలను ప్రతిఒక్కరూ అనుసరించాలన్నారు. పొలిటికల్ సైన్స్ అధ్యాపకుడు ధారావతు మల్లేష్ మాట్లాడుతూ గాంధీజీ క్విట్ ఇండియా ఉద్యమం ద్వారా డూ ఆర్ డై నినాదంతో అన్ని వర్గాల ప్రజలలో చైతన్యం తీసుకొచ్చి ఉద్యమాన్ని తీవ్రతరం చేయడంతో స్వాతంత్ర్య సాధనకు మార్గం సుగమం అయిందని పేర్కొన్నారు.

చింతలపూడి : క్విట్ ఇండియా ఉద్యమం దినోత్సవాన్ని పురస్కరించుకుని చింతలపూడి ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో మంగళవారం వేడుకలు నిర్వహించారు. ప్రిన్సిపాల్ డా.పి.శ్రీనివాసరావు అధ్యక్షతన ఎ.సంతోషరావు, కె.హరిప్రసాద్ ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం నిర్వహించారు. వైస్ ప్రిన్సిపాల్ నరేంద్ర కుమార్, అధ్యాపకులు పాల్గొన్నారు.

వరిలో ఎండాకు తెగులు నివారణకు చర్యలు

లింగపాలెం : లింగపాలెంలో వరిపైరును మంగళవారం ఏరువాక కేంద్రం శాస్త్రవేత్తలు డాక్టర్ ఫణి కుమార్, డాక్టర్ నాగేంద్రబాబు, కోఆర్డినేటర్ డాక్టర్ టి సుజాత పరిశీలించారు. వరిలో ఎండాకు తెగులు నివారణకు రైతులకు పలు సూచనలు చేశారు. వరి నారుమడిలో నాట్లు వేసిన 25 నుంచి 30 రోజుల లోపు ఉన్న వరిలో ఆకులు ఎండిపోవడం, పసుపు రంగులోకి మారితే ఎండాకు తెగులు సోకినట్లు తెలుస్తుందన్నారు. ఐదు శాతం ఆశించినచో రైతులు యాజమాన్య పద్ధతులు పాటించాలన్నారు. నత్రజని ఎరువులు వేయడం తాత్కాలికంగా ఆపివేయాలన్నారు. తెగులు ఆశించిన పొలాల్లో నీటిని ఎక్కువ రోజులు నిల్వ ఉంచకుండా మురుగునీరు బయటకు పంపాలన్నారు. పోటాష్ ఎరువును 20 కేజీలు విధిగా వేయాలన్నారు. సిఫారుసు చేసిన మోతాదులోకే ఎరువులను వాడాలన్నారు. కాపర్‌హైడ్రోక్సైడ్ 2.0గ్రా ప్లస్ ప్లాంటామైసిన్ 1.0 గ్రా ఒక లీటరు నీటికి కలిపి వారం పదిరోజుల వ్యవధిలో రెండు సార్లు పిచికారి చేయాలని సూచించారు.

దళారుల గుండెల్లో గుబులు

కుక్కునూరు : గొమ్ముగూడెం గ్రామానికి ఆర్‌అండ్‌ఆర్ పరిహారం జమకావడంతో దళారుల గుండెల్లో గుబులు పట్టుకుంది. సోమవారం ముఖ్యమంత్రి పర్యటన నేపథ్యంలో గొమ్ముగూడెంకు చెందిన నిర్వాసితుల ఖాతాలలో ప్రభుత్వం కుటుంబ ప్యాకేజీతో పాటు ఇళ్లకు సంబంధించిన పరిహారాన్ని జమచేసింది. కాగా గతంలో గ్రామస్తుల అమాయకత్వాన్ని ఆసరాగా చేసుకొని కొందరు దళారులు ఇంటి విలువలు పెంచేట్టు చేస్తామంటూ పెద్ద ఎత్తున వసూళ్లకు పాల్పడినట్టు సమాచారం. అలా వసూళ్లకు పాల్పడిన వారు ఇంటి పరిహారం పెరుగుతుందని ఇన్ని రోజులు నిర్వాసితులను మభ్యపెడుతూ వచ్చారు. కాగా సోమవారం నిర్వాసితుల ఖాతాలలో పరిహారం జమకావడంతో ఇంటి విలువలు పెరగలేదని తెలుసుకున్న నిర్వాసితులు ఇచ్చిన డబ్బులు వెనక్కి తీసుకునేందుకు సమాయత్తమవుతున్నారు. దళారులు తీసుకున్న డబ్బులను వెనక్కి తిరిగి ఇవ్వకపోతే వసూళ్లకు పాల్పడిన వారి పేర్లతో సహా కలెక్టర్‌కు ఫిర్యాదు చేసేందుకు నిర్వాసితులు సిద్ధమైనట్లు తెలుస్తుంది.